

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి తెలిపారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో మైనారిటీ గురుకుల ప్రవేశానికి సంబంధించి వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి మాట్లాడుతూ... మైనారిటీ గురుకులాల్లో అడ్మిషన్ల దరఖాస్తుల ప్రక్రియ ఆరంభమైందని తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, రమేష్‌లాల్ హట్కి, ప్రిన్సిపాళ్లు జి.శ్రీనివాసరావు, ఎమ్డీ.రహీం, వనజ, రిజ్వానా, స్వప్న పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం

క్రీడల ఖిల్లాలో.. స్టేడియం ఏదీ?

- జిల్లా స్థాయిలో క్రీడల నిర్వహణకు మైదానం లేక ఇక్కట్లు
- మానుకోట పట్టణంలో స్టేడియాన్ని నిర్మించాలని డిమాండ్

మహబూబాబాద్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఖిల్లా.. క్రీడలకు పుట్టినిల్లు మానుకోట జిల్లా కేంద్రంలో క్రీడా స్టేడియం కరువైంది. అనేక ఏళ్ల నుంచి వస్తున్న స్టేడియం ఏర్పాటు డిమాండ్ అమలుకు నోచుకోవడం లేదు. దినదినాభివృద్ధి చెంది జిల్లా కేంద్రంగా ఆవిష్కృతమైనప్పటికి అన్ని హంగులతో నిర్మాణం జరగలేదు. వేసవి సెలవుల్లో విద్యార్థులు, క్రీడాకారులు ఆటలు ఆడుకోవడానికి జిల్లా కేంద్రంలో కనీసం క్రీడా మైదానం కూడా లేదు. మహబూబాబాద్ జిల్లా ఏర్పాటు కాక ముందు.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన నిర్మించిన ఎన్టీఆర్ మినీ స్టేడియమే దిక్కు అయింది. అందులోనే క్రీడా పోటీలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇండోర్ స్టేడియం కూడా లేక ఇండోర్ గేమ్స్ నిర్వహణ కష్టతరంగా మారింది. ఉన్న ఒక్క ఎన్టీఆర్ మినీ స్టేడియంకు ఆలనా.. పాలనా కరువైంది. అది బహిరంగ సభలకు వేదికగా మాత్రం ఉపయోగపడుతుందే తప్ప పూర్తిస్థాయిలో క్రీడల నిర్వహణకు ఉపయోగపడేలా అన్ని వసతులు లేవు. తెలంగాణ రాష్ట్ర విభజన కాక ముందు నుంచే మానుకోట క్రీడాకారులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో రాణించిన ఘన చరిత్ర ఉంది. అంతటి క్రీడాచరిత్ర కలిగిన మానుకోట గడ్డపై క్రీడాకారులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడం, నూతన క్రీడాకారులను తయారు చేసేందుకు మైదానాలు కరవయ్యాయంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఒక్క బాస్కెట్ బాల్ కోర్టు తప్ప.. దేనికి పర్మినెంట్‌గా క్రీడా ప్రాంగణాలు లేవు. మానుకోట జిల్లా కేంద్రంలో క్రీడా స్టేడియాన్ని నిర్మించి క్రీడలకు పూర్వవైభవం తీసుకురావాలని క్రీడాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రీడలకు నిలయంగా మానుకోట..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే మానుకోటను క్రీడలకు నిలయంగా చెప్పుకుంటారు. జాతీయ క్రీడా చరిత్రలో మానుకోట ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్‌తోపాటు అథ్లెటిక్స్‌లో సైతం రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. వాలీబాల్ క్రీడకు ఇండియా కెప్టెన్‌గా జిల్లాలోని ఇనుగుర్తి గ్రామానికి చెందిన వెంకటనారాయణ వ్యవహరించారంటే ఈ ప్రాంత క్రీడా ఘన చరిత్ర ఏంటో అర్థమవుతోంది. అంతేకాకుండా అన్ని క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఈ ప్రాంత క్రీడా చరిత్రను విశ్వవ్యాప్తం చేసి అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో, ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఇప్పటికి బాస్కెట్‌బాల్, ఇతర క్రీడల రాష్ట్ర పోటీల నిర్వహణకు మానుకోట ప్రాతిని ధ్యం వహిస్తోంది. అలాంటి గడ్డలో స్టేడి యం లేకపోవడంతో నూతన క్రీడాకారులు తయారు కావడం లేదు. నాడు అవకాశాలు తక్కువగా ఉన్నప్పటికీ అనేక మంది ఈ ప్రాంతం నుంచి క్రీడాకారులుగా ఎది గారు. ప్రస్తుతం అనేక అవకాశాలున్నా క్రీడాకారులుగా రాణించలేక పోతున్నారంటే ఇక్కడ సరియైన వసతులు కల్పించకపోవడమే కారణమని చెప్పవచ్చు.

ఎన్టీఆర్ మినీ స్టేడియానికి ఆలనా.. పాలనా కరువు..

జిల్లా కేంద్రంలో రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆనుకుని ఉన్న ప్రాంతంలో 2004లో సుమారు నాలుగు ఎకరాల్లో ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. అందులో రెండు గదులను నిర్మించి వదిలేశారు. క్రీడాకారులకు

మిగతా 8వ పేజీలో...



ఎన్టీఆర్ స్టేడియం వద్ద డ్రెయినేజీ నిర్మాణం కోసం ప్రహరీని కూల్చి వదిలేసిన దృశ్యం

మినీ స్టేడియంలో వసతులు కల్పించాలి

పట్టాభి లక్ష్మయ్య, కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, మానుకోట



మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేయాలి. ఇందులో క్రీడాకారులకు కావల్సిన మౌలిక వసతులు కల్పించాలి. చిన్నారుల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు రోజూ ఉదయం, సాయంత్రం వందలాది మంది వాకింగ్ చేసేందుకు వస్తున్నారు. వర్షం వస్తే స్టేడియమంతా బురదమయంగా మారుతుంది. వర్షం పడ్డ సమయాల్లో రోడ్ల వెంట వాకింగ్ చేయాల్సి వస్తోంది.



ప్రత్యేక పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు



పుష్కరిణికి నవరత్న హారతి ఇస్తున్న కాశీ పండితులు

పుష్కర స్నానం.. పుణ్యఫలం

కాళేశ్వర త్రివేణి సంగమానికి కొనసాగుతున్న భక్తుల రద్దీ

- ఐదో రోజున స్వల్ప తగ్గుదల.. 60వేల మందికిపైగా వచ్చినట్టు అంచనా
- పుష్కరస్నానం ఆచరించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు
- త్రయంబకేశ్వర్ స్వామీజీ సహా పలువురు వీఐపీల రాక
- ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెడుతూ పోలీసుల పకడ్బందీ చర్యలు

7



త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

- ప్రతి ఒక్కరూ షెడ్యూల్ ప్రకారం హాజరవ్వాలి
- జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి



గూడూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శిక్షణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండల కేంద్రాల్లో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రంలో ఆర్పీలు, సీఆర్పీల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ షెడ్యూల్ ప్రకారమే శిక్షణకు హాజరు కావాలని, స్పెల్‌లో మార్పులు అంగీకరించబడవన్నారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాలన్నారు. ఉపాధ్యాయులందరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని లాగిన్ వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయుల హాజరు జియో ట్యాగ్ చేయబడుతుందని, శిక్షణ ప్రాంగణం నుంచే హాజరు నమోదు చేసుకోవాలని చెప్పారు. లాగిన్ సమస్యలుంటే వివరాలను యు-డైస్ ప్లస్, ఐఎస్ఎంఎస్ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. శిక్షణకు సంబంధిత సబ్జెక్ట్ అన్ని తరగతుల పాఠ్యపుస్తకాలు తీసుకురావాలని సూచించారు. శిక్షణకు హాజరైన ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రీ టెస్ట్, పోస్ట్ టెస్ట్ ద్వారా రాయాలని, అప్పుడు మాత్రమే శిక్షణ సర్టిఫికెట్ పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యే మండల స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. అలాగే గూడూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శిక్షణకు సంబంధించిన ఏర్పాట్లను డీఈవో రవీందర్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమానికి వంద శాతం హాజరు కావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, హెచ్ఎం సదాశివ, డీఆర్పీలు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

- ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో తరలించాలి
- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. జిల్లాలోని చిన్నగూడూరు మండలం విస్సంపల్లి, ఉగ్గంపల్లి, చిన్నగూడూరు, మహబూబాబాద్ మండలం కంబాలపల్లి, శనిగపురం గ్రామాల్లో మెప్మా, ఐకేపీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన, రైస్ మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనె సంచులు, రవాణాకు సంబంధించి లారీల విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో తరలించి రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. వాతావరణ మార్పుల దృష్ట్యా అకాల వర్షాలు సంభవించే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ఈ సంవత్సరం అధిక దిగుబడి ఉన్నందున అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు తదితర అంశాలపై జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుందని తెలిపారు.

గత పది రోజులుగా ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారని చెప్పారు.



కంబాలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

- కేసముద్రం గాంధీ సెంటర్‌లో నిందితుల పట్టివేత
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్/కేసముద్రం, మే 19 (ఆంధ్రజ్యోతి) : అల్లుడి కళ్లలో కారం చల్లి, కత్తితో పొడిచి హతమార్చిన కేసులో మామ, అత్త, భార్యను అరెస్టు చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం నిందితులు మృతుడి మామ బానోత్ వీరన్న, అత్త బానోత్ కైల, భార్య లకావత్ మౌనికను అరెస్టు చూపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని బల్హార్ష ప్రాంతానికి చెందిన లకావత్ బాల(35)కు తొమ్మిదేళ్ల క్రితం కేసముద్రం మండలం ధర్మారంతండాకు చెందిన బానోత్ వీరన్న, కైల దంపతుల కుమార్తె మౌనికతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. హైదరాబాద్ లింగంపల్లిలో వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా బాల పనిచేస్తూ కుటుంబంతో సహా అక్కడే ఉంటున్నాడు. మౌనిక మరో వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుందనే విషయంలో భార్య భర్త మధ్య తరచూ గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో మౌనిక తన తల్లిగారి ఇంటికి వచ్చింది. ఈనెల 17న రాత్రి బాల ధర్మారంతండాకు వెళ్లగా భార్య, అత్తమామలు పథకం ప్రకారం బాల కళ్లలో అత్త, భార్య కారం చల్లగా, బానోత్ వీరన్న కత్తితో ఛాతిపై పలుమార్లు పొడిచాడు. దీంతో బాలను 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అప్పటి నుంచి నిందితులు పరారీలో ఉన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మామ బానోత్ వీరన్న, అత్త బానోత్ కైల, భార్య లకావత్ మౌనికను కేసముద్రం గాంధీ సెంటర్ ప్రాంతంలో తిరుగుతుండగా పట్టుకొని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి నిందితుల అరెస్టుకు కృషి చేసిన మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కేసముద్రం ఎస్ఐ మురళీధర్‌రాజ్, ప్రొబేషన్ ఎస్ఐ రవికిరణ్, సిబ్బంది ఐలయ్య, రాజు, వెంకన్న, రాజేందర్‌లను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ తిరుపతిరావు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మదార్‌గౌడ్ మాట్లాడుతూ.. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారిల ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని సూచించారు. ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు హాల్‌టికెట్‌లు ఇవ్వకపోయినా నెట్ సెంటర్లలో డౌన్‌లోడ్ చేసుకొని పరీక్ష రాయవచ్చన్నారు. విద్యార్థుల హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం, స్టాంపు లేకపోయినా సీఎస్, డీవోలు వారిని పరీక్ష కేంద్రాల్లోకి పంపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రాజకుమారి, కుమార్, సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్‌లు, అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో మదార్‌గౌడ్



వరంగల్ జిల్లా జట్టును అభినందిస్తున్న అజీజ్‌ఖాన్

నెట్‌బాల్ పోటీల్లో వరంగల్ జట్టు సత్తా

రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్యం కైవసం

వరంగల్ స్పోర్ట్స్, మే 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-16 మిక్స్‌డ్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వరంగల్ జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు సోమవారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని నెట్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ పాల్గొని వరంగల్ జిల్లా జట్టు సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 33జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా, ఇందులో వరంగల్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో రాణించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్‌కుమార్, నెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల సృజన్‌కాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లిల్లీ ఫోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్‌లో మంగమ్మకు డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఇప్ప మంగమ్మకు హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఎం.ముత్తారెడ్డి సోమవారం మ్యాథ్స్‌లో పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. ప్రొఫెసర్ వై.ధర్మేందర్‌రెడ్డి పర్యవేక్షణలో 'న్యుమరికల్ సొల్యూషన్స్ ఆఫ్ ఎంహెచ్‌డీ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ నానో ఫ్లూయిడ్ ఫ్లో ప్రాబ్లమ్ ఓవర్ ఏ ష్రింకింగ్ స్ట్రెచింగ్ సర్ఫేస్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి ఆమెకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసింది.

దీప్తికి గీతం యూనివర్సిటీ డాక్టరేట్



వరంగల్‌కు చెందిన ఆర్.దీప్తికి విశాఖపట్టణంలోని గీతం యూనివర్సిటీ ఫార్మసీలో పీహెచ్‌డీ డిగ్రీని సోమవారం ప్రకటించింది. ప్రొఫెసర్ జి.సుహాసిని పర్యవేక్షణలో 'అడెనిన్ ఇన్‌డ్యూస్డ్ క్రానిక్ కిడ్నీ డామేజ్ అండ్ కార్డియోవాస్క్యులర్ ఆల్టరేషన్స్ టార్గెటింగ్ టీజీఎఫ్ బీటా-1 అండ్ కాస్పేస్-3' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి ఆమెకు డాక్టరేట్‌ను ప్రకటించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రకటించారు. కాగా దీప్తి ప్రస్తుతం ఓగ్లాపూర్ కేర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కమిషనరేట్‌లో పలువురు ఏసీపీల బదిలీ

వరంగల్ క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ డివిజన్‌లలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డిని హైదరాబాద్ డీజీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో రాచకొండ షీ టీం ఏసీపీగా పనిచేస్తున్న పి.నర్సింహరావును నియమించారు. మామునూరు ఏసీపీ బి.తిరుపతిని డీజీ కార్యాలయానికి ట్రాన్స్‌ఫర్ చేయగా, ఆయన స్థానంలో ఖమ్మం ఎస్‌బీఐ అండ్ సెక్యూరిటీ ఏసీపీ ఎన్.వెంకటేష్‌ను నియమించారు. సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పి.సదయ్యను వరంగల్ సీసీఎస్ ఏసీపీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, రెండు రోజుల కిందటే క్రైం ఏసీపీగా వి.కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించడం గమనార్హం.

మన బంగారం మంచిదేనా?

- తూనికలు, కొలతల శాఖాధికారులకు తనిఖీ అధికారం
- సీజీఎక్స్ 101 యంత్రం లేక ఇబ్బందులు
- నష్టపోతున్న పసిడి కొనుగోలు దారులు
- నగరంలో నాలుగు హాల్‌మార్కింగ్ సెంటర్ల మూత
- నేడు ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం



బంగారం స్వచ్ఛతను కొలిచే సీజీఎక్స్ 101 యంత్రం

హనుమకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో అమ్మకమయ్యే వివిధ వస్తువుల బరువు, ధరల విషయంలో వ్యాపారులు మోసాలకు పాల్పడకుండా తనిఖీలు చేసే తూనికలు, కొలతల అధికారులకు బంగారం స్వచ్ఛతను తనఖీ చేసే అధికారం కూడా ఉంది. కానీ వీరు దీనిని వినియోగించుకోలేక పోతున్నారు. ఇందుకు కారణం బంగారం, వెండి స్వచ్ఛతను నిర్ధారించే సీజీఎక్స్ 101 పరికరం అందుబాటులో లేకపోవడమే. ఈ యంత్రం లేకపోవడం వల్ల అధికారులు బంగారం, వెండి దుకాణాల జోలికి వెళ్లడంలేదు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. నేడు ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో బంగారం, వెండి నగల స్వచ్ఛతలో జరుగుతున్న మోసాలు, అధికారం ఉండి ఏమీ చేయలేని తూనికల కొలతల అధికారులపై ప్రత్యేక కథనం.

సీజీఎక్స్ 101 యంత్రం ఏర్పాటు ఎప్పుడు?

బంగారం స్వచ్ఛత, బరువును పరీక్షించే అధికారం తూనికలు కొలతల శాఖకు కూడా ఉన్నది. బహిరంగ మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ కాంటాలు, నిత్యావసర వస్తువుల బరువు, రేట్లు తదితర వాటిని తనఖీచేసే తూనికలు కొలతల శాఖ అధికారులకు 2011 రూల్ 9 (4) ప్రకారం బంగారం, వెండి ఆభరణాల నాణ్యతను పరీక్షించే అధికారం కూడా ఉన్నది. వారు కూడా ఎప్పటికప్పుడు వెండి, బంగారం నగల దుకాణాలతో ఆకస్మిక తనిఖీలు జరిపి అక్కడ విక్రయిస్తున్న బంగారం స్వచ్ఛత, బరువును పరీక్షించి లోపాలు ఉన్నట్లయితే కేసులు నమోదు చేయవచ్చు. కానీ అధికారులు వాటికి జోలికి వెళ్లడం లేదు. ఇందుకు కారణం బంగారం, వెండి స్వచ్ఛతను కొలిచే పరికరం లేకపోవడమే.

ప్రతీ జిల్లాలో ఏర్పాటు చేయాలి

వాస్తవంగా ప్రతీ జిల్లాలో తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో ఇలాంటియంత్రాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ యంత్రం పేరు ఎక్స్ రే ఫ్లోరోసెన్సెస్ స్పెక్ట్రో మీటర్ కాంటిక్ సీజీఎక్స్ 101. ఈ యంత్రం సహాయంతో కేవలం 30 సెకన్లలో బంగారం స్వచ్ఛతను తెలుసుకోవచ్చు. బంగారం ఆభరణాన్ని యంత్రంపై ఉంచితే చాలు. యంత్రంలోని ఎక్స్‌రే కిరణాలు ఆభరణంలోకి దూసుకువెళ్లి తిరిగి రిఫ్లెక్స్ అవుతాయి. యంత్రానికి అనుసంధానం చేసిన సాఫ్ట్‌వేర్ ఆధారంగా క్షణాల్లో ఆ ఆభరణం ఎన్ని క్యారెట్లు ఉంది? అందులో కలిసిన కాపర్, జింకు, సిల్వర్, నికెల్ తదితర లోహాల శాతాన్ని చెప్పేస్తుంది. ఈ యంత్రంతో బంగారంలో నాణ్యత, స్వచ్ఛతను సులువుగా తెలుసుకోవడంతో పాటు మోసం జరిగితే సదరు వ్యాపారిపై కొనుగోలుదారులు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఈ యంత్రం ఖరీదు సుమారు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు ఉంటుంది. ఈ యంత్రం లేకపోవడంవల్ల తమకు అధికారం ఉన్నప్పటికీ తూనికలు, కొలతల శాఖ అధికారులు బంగారుం, వెండి దుకాణాల్లో తనఖీలు చేయలేకపోతున్నారు. ఖరీదైనదవి అయినందువల్ల బంగారం, వెండి వస్తువుల శాంపిళ్లను సేకరించడం కష్టం. ఒక వేళ సేకరించినా వాటిని పరీక్ష కోసం హైదరాబాద్‌లోని తూనికలు కొలతల ప్రధాన కార్యాలయానికి పంపి రిపోర్టులు వచ్చే వరకు ఎదురుచూడాలి. ఈ తతంగం అంతా కష్టంతో కూడుకున్నది కావడంతో అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదు. బీఐఎస్ అధికారులే ప్రస్తుతం ఈ బాధ్యతను నిర్వహిస్తున్నారు.

హాల్‌మార్క్ సెంటర్ల మూత

నగరంలో 5 హాల్‌మార్క్ సెంటర్లు ఉండగా వీటిలో నాలిగింటిని బ్యూరో ఆఫ్ ఇండియాన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారులు మూసివేశారు. వాటి లైసెన్సులను రద్దు చేశారు. ఈ నాలిగింటిలో మూడు వరంగల్ విశ్వకర్మ వీధిలోనివి కాగా, ఒకటి హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లోది. బంగారం షాపుల్లో కొన్న నగలు నిర్ధేశిత ప్రమాణాల మేరకు స్వచ్ఛతతో ఉన్నాయా? లేవా అనేది నిర్ధారించడానికి కొనుగోలుదారులు తాము కొన్న నగలను ఈ హాల్ మార్కింగ్ సెంటర్లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. ఇటీవల బీఐఎస్ అధికారులు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో బంగారం శాంపిల్స్‌ను సేకరించిన క్రమంలో చాలా వరకు అవి నిర్ధారిత ప్రమాణాల మేరకు స్వచ్ఛత లేదన్న విషయం బయటపడింది. దీనితో నాలుగు హాల్ మార్క్ సెంటర్ల లైసెన్సులను రద్దు చేసింది. వాటిని మూసివేయించింది.

బంగారం, వెండిలో మోసాలు

సాంబరాజు చక్రపాణి, జాతీయ ప్రధాన కార్యదర్శి, వినియోగదారులదారుల మండలి



బంగారం, వెండి స్వచ్ఛతను తనఖీ చేసేందుకు తూనికలు, కొలతల అధికారులు వారికున్న అధికారాన్ని వినియోగించుకునేందుకు వీలుగా బంగారం స్వచ్ఛతను కొలిచే యంత్రాలను వెంటనే అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి. ఇందు వల్ల బంగారం, వెండి నాణ్యత విషయంలో కొనుగోలుదారులు మోసపోకుండా ఉంటుంది. నగల వ్యాపారుల మోసాలను అరికట్టేందుకు వినియోగదారుల మండలి ఇప్పటికే హనుమకొండలోని మూడు కార్పొరేట్ బంగారు ఆభరణాల షోరూంలపై వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది.

ఎయిర్‌పోర్ట్ తరహాలో వరంగల్ రైల్వేస్టేషన్



మీడియాతో మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

ప్రారంభానికి సిద్ధం చేశాం

అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ శ్రీరామమూర్తి

గిర్మాజిపేట, మే19 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద వరంగల్ రైల్వేస్టేషన్‌ను రూ.25.41కోట్లతో ఎయిర్‌పోర్ట్ తరహాలో తీర్చిదిద్దామని, ఈనెల 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐ.శ్రీరామమూర్తి తెలిపారు. సోమవారం ఆయన వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆసియాలో అతి పెద్ద ప్రజారవాణా వ్యవస్థగా సేవలందిస్తున్న భారతీయ రైల్వేశాఖను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని, రైళ్లు, రైల్వేస్టేషన్‌లు, రైలు మార్గాల అభివృద్ధి, విస్తరణ చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌ను కాకతీయ కళావైభవంతో రూపొందించామన్నారు. ఐదేళ్లలో వరంగల్ రైల్వేస్టేషన్‌ను రూ.45కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. త్వరలో భద్రతా స్కానింగ్ యంత్రాలు, అధునాతన సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో స్టేషన్ మేనేజర్ జె.సారయ్య, ఐఎడబ్లు శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ పి.శ్రీనివాస్‌గౌడ్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజ్‌గోపాల్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్లు విజయ్ కుమార్, రాజేంద్రప్రసాద్, ఆరోగ్య అధికారి మధు తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కేయూ క్యాంపస్ మే 19, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మే 20 నుంచి నిర్వహించే ఎంఎ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల ఆఖరు సెమిస్టర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 4,300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. వర్సిటీ పరిధిలో విద్యార్థులకు 26 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షలు 20, 22, 24, 27, 29, 31వ తేదీల్లో నిర్వహిస్తామని వెల్లడించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



మహేశ్(ఫైల్)

నెక్కొండ, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్లవాడ గ్రామానికి చెందిన కర్నెకంటి మహేశ్ (19) రైలు ఢీ కొనడంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. రెడ్లవాడ గ్రామానికి చెందిన అయిలయ్య, పద్మ దంపతుల కుమారుడు మహేశ్ తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌లో హౌస్ కీపింగ్ పనులు చేసుకుంటున్నాడు. మహేశ్ తాతయ్య యాదగిరి ఆనారోగ్యంతో ఈనెల 17న మృతి చెందగా 18న జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్న అనంతరం హైదరాబాద్ వెళుతున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి నెక్కొండ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైల్వే స్టేషన్ సమీపంలో అప్‌లైన్‌పై వెళుతున్న గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురైన మహేశ్ మృతి చెందినాడు, శవ పంచనామా జరిపి శవాన్ని తండ్రి అయిలయ్యకు అప్పగించారు. మృతుడు అవివాహితుడు.

వరంగల్‌లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సీఎం హామీ

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- సందడిగా అండర్-25 బాలురు క్రికెట్ లీగ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బస్వరాజు సారయ్య

వరంగల్ స్పోర్ట్స్, మే 19(ఆంధ్రజ్యోతి) : రంజీ, ఐపీఎల్ స్థాయి క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించే విధంగా నగరంలో అధునాతన క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తెలిపారు. సోమవారం వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్డిపురంలోని క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా అండర్-25 బాలుర క్రికెట్ లీగ్ పోటీలను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా క్రికెట్ క్రీడాకారుల చిరకాల వాంఛ అయిన క్రికెట్ స్టేడియం ఏర్పాటు కోసం ఇటీవల ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిలను కలిశానన్నారు. దీంతో వరంగల్‌లో స్టేడియం గురించి వేం నరేందర్‌రెడ్డి సీఎం వద్ద ప్రస్తావించగా త్వరలోనే స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని మాట ఇచ్చారన్నారు. హైదరాబాద్ నగరం తరువాత పెద్ద నగరంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో క్రికెట్ స్టేడియం తప్పకుండా ఉండాలని, స్టేడియం ఏర్పాటుకు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంతర్ జిల్లా స్థాయి అండర్-25 బాలుర క్రికెట్ లీగ్ పోటీలు జూన్ 2వ తేదీ వరకు రెడ్డిపురం, మొగిచర్ల, వంగపల్లి క్రికెట్ మైదానాల్లో లీగ్ పద్ధతిన నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు జట్ల అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి జూన్ 2వ తేదీ నుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న టూ-డే క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కాగా, తొలిరోజు రెడ్డిపురం క్రికెట్ మైదానంలో హనుమకొండ - భూపాలపల్లి జట్ల మధ్య, మొగిలిచర్ల మైదానంలో జనగామ - ములుగు జట్ల మధ్య, వంగపల్లి మైదానంలో వరంగల్ - మహబూబాబాద్ జట్ల మధ్య పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, సభ్యులు సదాశివ్, తోట రాము, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

తలంచి.. తరించి..

సముద్రాలలో ఘనంగా మహంకాళి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ● పాల్గొన్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి



మహంకాళి అమ్మవారి వద్ద జరిగిన హోమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాలలో నూతన ఆలయంలో మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం కన్నులపండువగా జరిగింది. యాదాద్రి దేవాలయ విశ్రాంత ప్రధాన అర్చకుడు కారంపూడి నరసించార్యులు, బొర్రా హరికిషన్ శర్మల అర్చకుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహంకాళి జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అర్చకులు మహంకాళి, పోచమ్మ అమ్మవారి ఆలయాల్లో ధ్వజస్తంభంల వద్ద ఏక కాలంలో యంత్రప్రతిష్ఠను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో గ్రామంలో, ఆలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ

వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యలు హాజరయ్యారు. ధర్మకర్త కుందూరు నాగమణి - సోమిరెడ్డిల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. వారు ప్రత్యేక పూజలు చేసి, హోమం. శివ-పార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఆలయ ధర్మకర్త నాగమణి-సోమిరెడ్డి దంపతులు లక్షలాది రూపాయలు వెచ్చించి రాతితో ఆలయంను నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించడానికి, నారాయణపురంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్‌రెడ్డి, నాయకులు సీహెచ్ నరేందర్ రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, ఎన్. శ్రీరాములు, బాస్కుల కిరణ్, తాటికొండ కుమారస్వామి, వీరగోని రాజు, గుండె నర్సయ్య, బత్తుల బాలరాజు, ఇమ్మడి హరిప్రసాద్, బైద ఎలిషన్, పల్లె రవీందర్, మందపురం అనిల్, ఎన్. అజయ్ రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

ఉత్సవాలకు సైలానీబాబా ముస్తాబు

- రేపటి నుంచి ప్రారంభం కానున్న గంధం ఉర్సు
- మూడు రోజుల పాటు వేడుకలు
- ఒగ్లాపూర్‌లోని దర్గా ఆవరణలో ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాలకు ముస్తాబైన సైలానీబాబా దర్గా

దామెర, మే 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఒగ్లాపూర్‌లోని సైలానీ బాబా దర్గా ప్రాంగణంలో 118వ హజ్రత్ సందల్ గంధం ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 21(బుధవారం) నుంచి మూడు రోజుల పాటు సందల్ గంధం ఉర్సు ఉత్సవాలు జరుగనున్నాయి. దర్గా ప్రాంగణమంతా విద్యుత్ లైట్లతో ముస్తాబు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగు నీరు, వైద్యం, భోజనం, వసతి వంటి వివిధ సదుపాయాలను నిర్వాహకులు సిద్ధం చేశారు. అలాగే పలు ప్రాంతాల నుంచి పీఠాధిపతులు, ప్రముఖులతో పాటు లక్షలాదిగా భక్తులు హాజరు కానున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా మహారాష్ట్ర నుంచి ప్రముఖ బ్యాండ్ వాయిద్యం కళాకారులతో నగారా (వాయిద్యం) ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బెంగళూరు, ఢిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు గంధం వేడుకలకు హాజరవుతారు. హనుమకొండ, కరీంనగర్, హైదరాబాద్, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి రానున్న భక్తులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఉర్సు గంధం ఉత్సవాలు

సైలానీ బాబా దర్గా ఆవరణలో ఈ నెల 21న ఒంటె మీద ఊరేగింపుగా గంధం తీసుకురావడంతో ఉర్సు జాతర ప్రారంభమవుతుంది. తర్వాత దర్గా పీఠాధిపతి అబ్దుల్ హమీద్ షామియా (సైలానీబాబా) సమక్షంలో ఛాదర్లు సమర్పిస్తారు. 22న రాత్రి 9 గంటలకు ప్రముఖుల ఆధ్వర్యంలో కవ్వాలీ కార్యక్రమం నిర్వహిస్తారు. 23న పీఠాధిపతి సైలానీ బాబా ఆధ్వర్యంలో తహలీల్ ఫాతెహా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

గంధం ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం..

పీఠాధిపతి అబ్దుల్ హమీద్ షామియా



గంధం ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరు కానున్నారు. భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. వైద్య, రెవెన్యూ, విద్యుత్, రవాణా తదితర శాఖల సహకారంతో జాతర విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అలాగే వాహనాల పార్కింగ్ కోసం దర్గా సమీపంలోని మూడు ప్రాంతాల్లో స్థలాలను కేటాయించాం. జాతరకు వచ్చే భక్తులకు మూడు రోజుల పాటు అన్నదానం చేయనున్నాం.



త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పుష్కర స్నానం..
పుణ్యఫలం..

కాళేశ్వర త్రివేణి సంగమానికి కొనసాగుతున్న భక్తుల రద్దీ

సంవిదానంద సరస్వతికి సరస్వతీ మాత విగ్రహాన్ని బహూకరిస్తున్న ఆలయాధికారులు





ముక్తీశ్వరాలయంలో పూజలు చేస్తున్న బండి సంజయ్ దంపతులు



మహాదేవుడి దర్శనం కోసం ముక్తీశ్వరాలయానికి వస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



పుష్కర స్నానమాచరిస్తున్న హైకోర్టు జడ్జి నర్సింగరావు, కుటుంబసభ్యులు

- ఐదో రోజున 60వేల మందికిపైగా వచ్చినట్టు అంచనా
- పుష్కరస్నానమాచరించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు
- త్రయంబకేశ్వర్ స్వామిజీ సహా పలువురు వీఐపీల రాక
- ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెడుతూ పోలీసుల చర్యలు

కాళేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): పుష్కరస్నానం ఆచరిస్తే.. పుణ్యఫలం దక్కుతుందంటూ వేలాదిమంది భక్తులు.. సరస్వతీ నమోనమామి అంటూ పుష్కరాలకు తరలొస్తున్నారు. కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలో అంతర్వాహిని చెంత పలు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు పుణ్యస్నానాలాచరించి.. ముక్తీశ్వరుడిని దర్శించుకుని పునీతులవుతున్నారు. ఉదయం వచ్చి రాత్రి జరిగే సరస్వతీ నదీ హారతిచ్చే వరకు ఉండి ఆ మహాఘట్టాన్ని చూసి భక్తులు పరవశించిపోతున్నారు. ఐదో రోజైన సోమవారం కాస్త భక్తుల రద్దీ తగ్గినప్పటికీ మొత్తం 60వేల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీవీఐపీల తాకిడి పెరిగింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ దంపతులు, నాసిక్ త్రయంబకేశ్వర్ పీఠాధిపతి శ్రీమహా మండలేశ్వర స్వామిజీ, హైకోర్టు జడ్జి నందిగొండ నర్సింగారావుదంపతులు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రనాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి, తదితరులు హాజరై పుణ్యస్నానాలు ఆచరించి ముక్తీశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.

ఐదో రోజు 60వేల మంది భక్తులు..

పుష్కరాలు ప్రారంభమై సోమవారానికి ఐదోరోజు కాగా.. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధికంగా వస్తారని అధికారులు అంచనా వేశారు. కానీ అనుకున్న స్థాయిలో భక్తులు రాలేదు. తొలి నాలుగు రోజులతో పోలిస్తే రద్దీ తక్కువగా కనిపించింది. ఈ క్రమంలో నాలుగు రోజుల్లో తలెత్తిన సమస్యలు, ఇబ్బందులపై సమీక్షించుకున్న అధికార యంత్రాంగం ఇకపై అలా జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ పెరుగుతుందన్న అంచనాలతో అధికారులు చలువపందిళ్లను మరికొన్నింటిని పెంచారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ..

శని, ఆదివారాల్లో తలెత్తిన ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. వారాంతమైన శని, ఆదివారాల్లో భక్తులు అధికంగా ఉండడం వల్లనో, ట్రాఫిక్ సమస్య తలెత్తడం మూలంగానో సోమవారం భక్తుల సంఖ్యపై ప్రభావం చూపిందని అధికారులు భావిస్తున్నారు. అయితే ఆదివారం ఉత్పన్నమైన సమస్యలను దృష్టిలోపెట్టుకుని జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను వేర్వేరు మార్గాల్లో నడిపించేందుకు కార్యాచరణ తయారుచేసింది. ఇందులో ఆర్టీసీ బస్సులను నేరుగా కాళేశ్వర క్షేత్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించగా ప్రైవేటు వాహనాలను అన్నారం క్రాస్ నుంచి చంద్రుపల్లి, పుస్కుపల్లి మార్గం మీదుగా మళ్లించాలని, లేదా, కాటారం, గంగార ం క్రాస్, దామెరకుంట మీదుగా కాళేశ్వరం వరకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే సోమవారం పెద్దగా జనం రాకపోవడంతో ప్రధానరహదారి గుండానే వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.





పుష్కరాల్లో.. పుష్కల ఆదాయం..

ముక్తీశ్వరాలయానికి ఐదురోజుల్లో రూ.57.04లక్షలు రాక

కాళేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలోని శ్రీ ముక్తీశ్వరాలయానికి ఆదాయం పుష్కలంగా వచ్చింది. పుష్కరస్నానాలు చేసిన అనంతరం భక్తులు అధిక సంఖ్యంలో ముక్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక దర్శనాల టికెట్లు, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా ఐదు రోజుల్లో దేవస్థానానికి రూ.57.04లక్షలు ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. పుష్కరాలు జరగడం ఇది తొలిసారే అయినా ఐదు రోజుల్లో ఆదాయం రూ.50లక్షలు దాటడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తొలిరోజు పలుచగా వచ్చినా రూ.4.26లక్షలు వచ్చాయి. అలాగే రెండో రోజు 12.73లక్షలు, మూడో రోజు 11.97లక్షలు, నాలుగోరోజు 12.84లక్షలు, ఐదో రోజు రూ.15.22లక్షలు ఆదాయం వచ్చిందని వివరించారు. లడ్డూ పులిహోర తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నామని, భక్తులు సంతృప్తిగా కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన వారం రోజుల్లో కోటికి పైగానే ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందని తెలిపారు.



వైభవంగా నవరత్న హారతి

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర త్రివేణి సంగమంలో సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి 7.20గంటల నుంచి 8గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్న హరతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హరతులతో కూడిన నవరత్న హరతిని పండితులు కన్నుల పండువుగా త్రివేణి సంగమం అంతర్వాహిని సరస్వతి మాతకు నిర్వహించారు.



నదీహారతి వేడుకను ఫోన్లలో బంధిస్తున్న భక్తులు

సుమారు గంటపాటు నిర్వహించిన నవరత్న హరతి కార్యక్రమంలో ఐజీ తరుణ్‌జోషి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాల్స్‌తో హారతి దర్శనం..

పుష్కరాల్లో భాగంగా నిత్యం సాయంత్రం సాయంలో కాశీ పండితులతో వైభవంగా నిర్వహిస్తున్న నవరత్న హారతిని వందలాది మంది భక్తులు తమ ఫోన్లలో ఫోటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కొందరు భక్తులు వివిధ రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్న తమ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు వీడియో కాల్ చేసి చూపుతున్నారు. అయితే సిగ్నళ్ల సమస్య తలెత్తుతుండటంతో చాలామంది వీడియోలు తీసుకుంటున్నారు.

పార్కింగ్‌లో ఉన్న వందలాది వాహనాలు



ఐదో రోజూ ఆలయంలో ప్రత్యేక హోమాలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని ఐదోరోజు కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో పలు హోమాలను నిర్వహించారు. సోమవారం సప్తమి కావడంతో ఉన్నత చదువులు, విదేశీ చదువుల కోసం మేధా దక్షిణామూర్తి హోమము, అపమృత్యు దోషాలు తొలగడానికి మహా అమృత మృత్యుంజయ హోమం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. మంగళవారం మన్యుసూక్త, కాలభైరవ హోమాలు నిర్వహించనునట్లు అధికారులు తెలిపారు.





అర్ఘ్యం వదులుతున్న డోర్నకల్ ఎమ్మెల్యే, విప్ రాంచంద్రునాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ముక్తీశ్వరుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



హైదరాబాద్ కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఆలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): పుష్కరాల్లో భాగంగా కాళేశ్వరం త్రివేణి సంగమ తీరంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరిస్తున్నాయి. సోమవారం హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారులు తమ ప్రదర్శనలతో అదరగొట్టగా.. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది. నిత్యం కళాకారులు నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి.

అనుబంధ ఆలయాల్లో భక్తుల రద్దీ

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి) : సరస్వతి నదిలో పుష్కర స్నానం అనంతరం భక్తులు కాళేశ్వర, ముక్తేశ్వర స్వామి దర్శించుకొని అనుబంధ దేవాలయాల్లోని స్వామివార్లను దర్శించుకోవడంతో ఆలయాల్లో రద్దీ కొనసాగుతుంది. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు శుభానంద దేవి, ప్రౌఢ సరస్వతి, రామాలయం, ఆది ముక్తేశ్వర స్వామి దర్శించుకుంటున్నారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు లడ్డు, ప్రసాదాలు తీసుకుంటున్నారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిట లాడుతున్నాయి.

భక్తుల సేవలో పోలీసులు.. భద్రత విధుల్లో బలగాలు



దేవాలయంలో భక్తులకు వాటర్ బాటిల్స్ అందిస్తున్న పోలీసు అధకారి



కుడుర్పల్లే వద్ద అడవిలో ఏరియా డామినేషన్ చేస్తున్న బలగాలు

సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. ఓ వైపు వేలాదిగా తరలొస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు సేవల్లో నిమగ్నమైతే.. మరోవైపు వీఐపీల రాక నేపథ్యంలో వారి భద్రత దృష్ట్యా ప్రత్యేక బలగాలు పహారా కాస్తున్నాయి. పోలీసులు ఎర్రటి ఎండలో ట్రాఫిక్ నియంత్రణ కోసం కాళేశ్వరం వచ్చి పోయే రోడ్లలో విధులు నిర్వహిస్తున్నారు. మరికొందరు పుష్కరఘాట్‌లు, ముక్తీశ్వరాలయంలోని క్యూ లైన్ల వద్ద బందోబస్తులో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో కొందరు క్యూలైన్లలో ఉంటున్న భక్తుల దాహార్తి తీర్చేందుకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్నారు. ఇక కర్రెగుట్టల్లో మావోయిస్టుల కదలికలు, ఎన్‌కౌంటర్ అలజడి నేపథ్యంలో పుష్కరాలకు వచ్చే వీఐపీల భద్రతను దృష్ట్యా ప్రత్యేక బలగాలు ఎర్రటి ఎండలో అడవిబాటలో నడుస్తూ ఏరియా డామినేషన్ నిర్వహిస్తున్నాయి.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

అందుబాటులో 'ఆయుష్' సేవలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరగుతున్న సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం ప్రాచీన వైద్య పద్ధతులైన ఆయుర్వేదం, యునాని, హోమియోపతిలకు సంబంధించిన చికిత్సలు, మందులు అందుబాటులో ఉంచారు. కాళేశ్వరం పీహెచ్‌సీ ఆవరణలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హనుమకొండ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భానుకుమార్ నేతృత్వంలో జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ తనూజారాణి ఆధ్వర్యంలో పలువురు వైద్యులు, ఫార్మసిస్టులు, ఎంఎన్‌వోలు భక్తులకు ఈ వైద్య సేవలందిస్తున్నారు. పుష్కరాలు ప్రారంభమైన ఐదురోజుల్లో సుమారు 2,500మందికిపైగా జనరల్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు.



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

నీట మునిగిన ఇద్దరిని కాపాడిన బలగాలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): పుష్కర స్నానం చేయడానికి వచ్చే భక్తులను నీటి ప్రమాదాల నుంచి కాపాడేందుకు నదీ తీ రంలో, పుష్కర ఘాట్లలో ప్రభుత్వం ఎస్డీ ఆర్ఎఫ్ బలగాలను మోహరించింది. ము లుగు జిల్లా చల్వాయి 5వ బెటాలియన్‌కు చెందిన 66మంది స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్)కు చెందిన 22మంది సిబ్బంది పలు బృందాలుగా, షిఫ్టులవారీగా సరస్వతి పుష్కర ఘాట్‌తో పాటు ఇతర ఘాట్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు రోజులుగా పుష్కర స్నానం చేస్తూ ఇద్దరు బాలురు నీటిలో మునిగిపోతుండగా.. వారిని రక్షించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తెలిపారు.



త్రివేణి సంగమంలో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

విద్యార్థులకు చదువే ఆయుధం : డీఈవో

గూడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విద్యే ఆయుధమని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. గూడూరు మండలం బ్రహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో రాణించాలన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు చురుకుగా, ఆరోగ్యంగా, దృఢంగా ఉంటారని చెప్పారు. సమ్మర్ క్యాంపు విజయవంతంగా ముగిసిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, జీఈసీవో విజయకుమారి, ఏఎంవో ఆజాద్, ఎంఈవో రవికుమార్, ఎస్‌వో సునీత, స్వర్ణలత, భవాని, సరస్వతి, మున్నీ, నీలిమ, సోమలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తితోనే ఆధ్యాత్మికంగా అభివృద్ధి : ఎమ్మెల్యే



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): భక్తితోనే ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతారని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరు మండలం దుబ్బగూడెంలో గ్రామ దేవత బొడ్రాయి, అంజనేయస్వామి ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో పాడి పశువులు సుభిక్షంగా ఉండి సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాదావత్ సరితబాలాజీ, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ దోహదం

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న సత్యవతిరాథోడ్

మహబూబాబాద్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు ఆరోగ్యాన్ని బాగు చేసుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్ దోహద పడుతుందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో సోమవారం 12 మందికి రూ.3,81,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. నిరుపేదలు సైతం కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బండ భిక్షంరెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, లింగరాజు, నర్సింహారెడ్డి, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అందించే సేవలను ప్రదర్శించాలి

- డీఎంహెచ్‌వో రవిరాథోడ్



మహబూబాబాద్‌లోని ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో రవిరాథోడ్

నెహ్రూసెంటర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రుల్లో మేనేజ్‌మెంట్ అందించే సేవలను పట్టిక రూపంలో ఆస్పత్రి ఆవరణలో ప్రదర్శించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.రవిరాథోడ్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవిరాథోడ్ మాట్లాడుతూ... క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010 నిబంధనలను అనుసరించి రుసుములు తీసుకోవాలన్నారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించిన పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బయోమెడికల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇచ్చే సర్టిఫికెట్లను విధిగా తీసుకుని అందరికి కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కొప్పు ప్రసాద్, హెచ్ఈవో లోక్య, అరుణ్‌కుమార్, మనోహర్, అనిల్ పాల్గొన్నారు.

మత్తు మహమ్మారి వలలో పడొద్దు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్‌నాయక్



మహబూబాబాద్‌లో యాంటీ డ్రగ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్‌నాయక్

నెహ్రూసెంటర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : యువత తన, దేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మత్తు మహమ్మారి వలలో పడొద్దని మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాదావత్ కిరణ్‌నాయక్ సూచించారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌నాయక్ మాట్లాడుతూ.. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరికిపండ్ల అశోక్, సీడబ్ల్యూసీ మెంబర్ డాక్టర్ డేవిడ్, ఆలియా, శ్యాం కిరణ్‌కుమార్, కనకరాజు, జ్యోతి, భారతి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

తునికాకు తరలిస్తున్న వాహనం స్వాధీనం?

కొత్తగూడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : తునికాకును అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మండలంలోని జంగవానిగూడెం గ్రామంలో అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. వివరాల్లోకి వెళితే... తునికాకు తరలింపుకు కావాల్సిన అటవీశాఖ అనుమతి పత్రాలు లేకుండా జంగవానిగూడెం నుంచి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో అటవీశాఖ అధికారులు దాడులు చేశారు. వాహనం కనపడక పోవడంతో సమీప అడవిలో తనిఖీలు చేపట్టారు. వాహనాన్ని అదుపులోకి తీసుకుని కొత్తగూడ రేంజ్ కార్యాలయానికి తరలించారు.

యూత్ కాంగ్రెస్ మండల కార్యవర్గం ఎన్నిక

దంతాలపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : యూత్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గాన్ని నూతనంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కొడుపుగంటి హరికృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు సంపెట సురేష్ గౌడ్ ప్రకటించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల ఉపాధ్యక్షులుగా వల్లపు మహేష్, పులుగుజ్జ ప్రశాంత్, సెక్రటరీగా గునిగంటి గురుమూర్తి, దాసరి సందీప్, చెరుకు వంశీతో పాటు పలువురిని కార్యవర్గంలోకి తీసుక్నుట్లు పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేసే వారికే పదవులు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



తొర్రూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతీ కార్యకర్తకు పదవులు వాటంతటవే వస్తాయని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు మండలం నాంచారిమడూరు గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానికంగా పార్టీ పటిష్టంగా ఉంటేనే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చన్నారు. ఓపికతో పార్టీ జెండా మోసిన నిజమైన కార్యకర్త ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి ప్రతీ సర్పంచ్, ఎంపీటీసీలను గెలిపించుకోవాలన్నారు. మీ గెలుపు కోసం ప్రతీ ఊరికి, ఇంటికి వచ్చి ఓట్లు అభ్యర్థిస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం తీసుకువస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మండల, పట్టణ, బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం చేసి పార్టీ సిద్ధాంతాలను అందించడమే తమ లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి అన్నారు. జిల్లా పరిశీలకురాలు రవళిరెడ్డి మాట్లాడుతూ పార్టీ నిర్మాణం కుటుంబ నిర్మాణం ఒక్కటేనన్నారు. అందుకోసమే క్షేత్రస్థాయిలో కమిటీలను వేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎర్రబెల్లి రాఘవరావు, నెహ్రూనాయక్, హమ్యానాయక్, సోమేశ్వర్‌రావు, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, మేకల కుమార్, గంజి విజయ్‌పాల్ రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, రాజేష్‌నాయక్, సతీష్, రామచంద్రయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, వెంకటనారాయణ గౌడ్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి

పెద్దవంగర: కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పని చేయడంతో పాటు సంస్థాగత నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో సోమవారం మండల స్థాయి సంస్థాగత నిర్మాణ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, జిల్లా పరిశీలకులు రవళిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తలను గుర్తించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కార్యకర్తల, నాయకుల ఏకాభిప్రాయంతోటే జరుగుతుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం సఫలీకృతమైందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ప్రకాష్‌రెడ్డి, హమ్మనాయక్, జాటోత్ నెహ్రూనాయక్, విజయపాల్‌రెడ్డి, మురళి, ప్రవీణ్‌రావు, శ్రీనివాస్, ముత్యాల పూర్ణచందర్, దేవేంద్ర, గోపాల్, రవీందర్‌రెడ్డి, వేణు, సైదులు, హరికృష్ణ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నెల్లికుదురు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర కటి ఆస్పత్రి వారిచే సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 75 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై శివరామకృష్ణ, ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకులు గద్దల జాన్, మాజీ సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, గడ్డం యాలాద్రి, చెడుపాక వెంకన్న, శంకర ఆస్పత్రి యాజమాన్యం రాజేష్, శ్యామ్, కోఆర్డినేటర్లు ఎర్పుల మహేంద్ర, మహేశ్వరి, బొల్లంపెల్లి సంధ్య, బండి రాధిక, వంశీ, యశోద పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

మహబూబాబాద్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపల్ 17వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గుర్రం శకుంతల విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రాన్ని అందించారు. నిరుపేదనైనా తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

చిన్నగూడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మరిపెడ ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మరిపెడ మండలం నీలికుర్తి గ్రామశాఖ సీపీఐ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో జరిగే అవకతవకల పై అధికారులను నిలదీసి పేదవాడికి లబ్ధిచేకూరే విధంగా కమ్యూనిస్టు కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలో, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ, రాజ్యాంగ వ్యవస్థలను సంక్షోభంలో నెట్టే విధానాలను ప్రజాస్వామిక వాదులు ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. అనంతరం నీలికుర్తి గ్రామ కార్యదర్శిగా సత్యంను ఎన్నుకున్నారు. ఆత్మ మరిపెడ డివిజన్ చైర్మన్ సుధాకర్‌రెడ్డిని ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్, వెంకన్న, మల్లేష్, శ్రీను, రవి పాల్గొన్నారు.

తూకంలో మోసం చేస్తున్నారని రైతుల ఆందోళన

- పెద్దనాగారం స్టేజీ వద్ద వ్యాపారిని నిలదీసిన అన్నదాతలు
- మిల్లును సీజ్ చేయాలని డిమాండ్

నర్సింహులపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుకు తరలించిన ధాన్యంలో వ్యాపారులు తూకంలో మోసం చేస్తూ దోపిడీ చేస్తున్నారని మండలంలోని పెద్దనాగారం స్టేజీ వద్ద శ్రీశ్రీ ఆగ్రోస్ మిల్లు ఎదుట సోమవారం రైతులు ఆందోళనకు దిగారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొబ్బ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో రైతులు పెద్ద సంఖ్యలో మిల్లు వద్దకు తరలివచ్చి గేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. మిల్లు యాజమానిని నిలదీసి తమ వద్దనుంచి అక్రమంగా దోచుకున్న ధాన్యాన్ని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మిల్లును సీజ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొబ్బ సంజీవరెడ్డి మాట్లాడుతూ... నర్సింహులపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెద్దనాగారం స్టేజీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత నెల రోజులుగా కురవి, కేసముద్రం, మరిపెడ, తొర్రూరు మండలాల పరిధిలో ఉన్న మిల్లులకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించినట్లు చెప్పారు. వారం రోజుల నుంచి పెద్ద నాగారం స్టేజీ సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లుకు ధాన్యాన్ని తరలిస్తున్న క్రమంలో ఆ మిల్లులో వేబ్రిడ్జి లేకపోవడంతో సమీపంలోని శ్రీశ్రీ ఆగ్రోస్ రైస్ మిల్లులో ఉన్న వేబ్రిడ్జి కాంటా వద్ద తూకం వేస్తున్నారని పేర్కొన్నారు. ఆ వేబ్రిడ్జి కాంటాలో సాంకేతిక లోపం మూలంగా ట్రాక్టర్ లోడ్‌కు 1.50 క్వింటాళ్ల తూకం తక్కువ చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీవెంకటేశ్వర రైస్ మిల్లుకు సుమారు 5వేల బస్తాల ధాన్యం తరలించామని, వీటిలో సుమారుగా 100 నుంచి 150 క్వింటాల ధాన్యాన్ని రైతుల నుంచి మిల్లరు అక్రమంగా దోచుకున్నట్లు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తూనికల కొలతల జిల్లా అధికారి విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని కాంటాలులో తలెత్తిన సాంకేతిక సమస్యను సరిచేసి ఇకపై నుంచి రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో రైతులు ప్రవీణ్, బాలు, వీరన్న, రవీందర్, వెంకన్న పాల్గొన్నారు.



పెద్ద నాగారం స్టేజీ వద్ద శ్రీశ్రీ ఆగ్రోస్ మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

అధైర్యపడొద్దు.. ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్

చిన్నగూడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రానికి వచ్చే ప్రతి గింజ కొనడం పూర్తయ్యే వరకు కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉంటాయని జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. మరిపెడ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ కృష్ణవేణితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మరిపెడలో గత రబీ సీజన్ 2023-2024లో 6346 మెట్రిక్ టన్నులు తరలించగా ఈ సారి 35571 మెట్రిక్ టన్నులు ధాన్యం మిల్లులకు తరలింపు జరిగిందన్నారు. యాసంగిలో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడంతో గతం కంటే నాలుగింతల దిగుబడి పెరిగిందన్నారు. జిల్లాలో 75శాతం ధాన్యం సేకరణ పూర్తయినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 26843 మంది రైతుల నుంచి సన్నధాన్యం లక్ష 4వేల626 మెట్రిక్ టన్నులు, దొడ్డురకం 27450 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.185 కోట్ల నగదును రైతుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు లక్ష 32వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఇంకా 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని అన్నారు. కొన్ని చోట్ల నిర్వాహకుల నిర్లక్ష్యం, అక్రమాల గురించి దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, డీపీఆర్‌వో రాజేంద్రప్రసాద్, సంబంధిత అధికారులు ఉన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న సీపీఎం నేత నాగయ్య

మహబూబాబాద్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమనిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్ భూ పోరాట కేంద్రంలోని కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య వక్తగా హాజరైన జి.నాగయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం, సమానత్వం, వ్యవసాయ కూలీల బతుకులను బాగు చేయడం కోసం వ్యవసాయ కార్మిక సంఘం పెట్టి నిరంతరం ఉద్యమించిన పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, ఖర్బన్, ఉమారాణి, రవి, బేబీ, ప్రవీణ్, ప్రియాంక, గోపిచంద్, నీలా, కృష్ణ, శృతి, కీర్తన, అనూష పాల్గొన్నారు.

- నెల్లికుదురు: మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు, పెరమాండ్ల బాబు గౌడ్, పుల్లయ్య, బానాల యాకయ్య, బొల్లంఎల్లయ్య, తోట నర్సయ్య, ఎల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.
- కురవి: కురవి సీపీఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకులు ఆమెడ నాగయ్య, నల్లపు సుధాకర్, గంధసిరి శ్రీనివాస్, మల్సూర్, కట్ల కృష్ణ, గంధసిరి జ్యోతిబసు, భద్రు, వాసు, రాంచంద్రు, భవాని పాల్గొన్నారు.
- కేసముద్రం: కేసముద్రంలో సుందరయ్య చిత్రపటం వద్ద సీపీఎం నాయకులు నివాళులర్పించారు. మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, చాగంటి కిషన్, మోడెం వెంకటేశ్వర్లు, జల్లె జయరాజ్, నీరుటి జలేందర్, సోమారపు ఎల్లయ్య, ముద్రకోల సారయ్య, గుగులోత్ కేశ్య పాల్గొన్నారు.
- గార్ల: మండలంలోని బుద్ధారంలో సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి వేడుకలను నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి, భాగం లోకేశ్వరరావు, సింగం వెంకటేశ్వర్లు, మోహన్, నాగరాజు పాల్గొన్నారు.
- డోర్నకల్: మండలంలోని గొల్లచర్లలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఐలి వెంకన్న, కాంగ్రెస్ నాయకులు పగిడిపాల వెంకన్న, సీపీఎం గ్రామ కార్యదర్శి ఓదేష్, కేవీపీఎస్ మండల కార్యదర్శి పెంటిక వెంకట్రాములు, నాయకులు పాల్గొన్నారు.
- తొర్రూరు: తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎమ్డీ.యాకూబ్, నాయకులు జమ్ముల శ్రీను, సాంబయ్య, దర్గయ్య, వెంకటేశ్వర్లు, మధు, వరలక్ష్మి, శోభ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పాకాల ఏటిలో ట్రాక్టర్ బోల్తా

గార్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని రాంపురం వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి పాకాల ఏటిలో పడింది. డోర్నకల్ మండలం గొల్లచర్లకు చెందిన కళ్లెపు యాకయ్య ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో గార్ల నుంచి సిమెంటు ఇటుకలు తీసుకొని పాకాల చెక్ డ్యామ్ మీదుగా గొల్లచర్ల వెళ్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి పాకాల ఏటిలో పడిపోయింది. డ్రైవర్‌తో పాటు యాకయ్య నీటిలో పడిపోవడంతో అక్కడేఉన్న ఇరువురు ప్రాణాలతో కాపాడారు. జేసీబీతో ట్రాక్టర్‌ను బయట తీశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కురవి, మే 19 (ఆంధ్రజ్యోతి): కురవి శివారులో ఐదు రోజుల క్రితం లారీని ఢీకొట్టి గాయపడ్డ బొడ్డు రాంబాబు(40) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం.. కురవి తహసీల్దార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న రాంబాబు విధులకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ రాంబాబును ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. రాంబాబుకు భార్య సైదమ్మ, కుమార్తె ఉన్నారు.

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఉపాధి హామీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న అన్నారు. తొర్రూరులో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వేసవిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. జూన్ 8వ తేదీన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఓమ భిక్షపతి, లక్ష్మణ్, బందు మహేందర్, కిరణ్, శ్యామ్, సాయిరెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు

మహబూబాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం నూతన తహసీల్దార్లు బాధ్యతలు చేపట్టారు. మహబూబాబాద్ తహసీల్దార్‌గా కె.చంద్రరాజేశ్వర్, కేసముద్రం తహసీల్దార్‌గా జి.వివేక్, బయ్యారం తహసీల్దార్‌గా చప్పిడి నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. అలాగే డోర్నకల్ తహసీల్దార్‌గా ఇమ్మాన్యుయేల్, కురవి తహసీల్దార్‌గా బి.విజయ, సీరోలు తహసీల్దార్‌గా పున్నం చందర్, నెల్లికుదురు తహసీల్దార్‌గా చంద నరేష్, మరిపెడ తహసీల్దార్‌గా కె.కృష్ణవేణి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయాల సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడల ఖిల్లాలో.. స్టేడియం ఏదీ?

(5వ పేజీ తరువాయి)

అవసరమైన కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే చాలు మైదానమంతా బురదమయంగా మారుతోంది. అందులో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారుల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు వాకింగ్(నడక), వ్యాయామం చేస్తారు. వర్షం వస్తే మినీస్టేడియం బురదమయంగా మారడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాయామం కోసం అందులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిర్మించినప్పటికీ పరికరాలు పనిచేయడం లేదు. దీంతో వ్యాయామం చేయడం కష్టతరంగా మారుతోంది. మినీ స్టేడియం నిర్వహణ, ఆలనా పాలనా చూసే వారు లేక పోవడంతో ఆవరణలో అక్కడక్కడ పిచ్చిచెట్లు పెరగడం, స్టేడియం ప్రాంగణంలో ఉన్న సైడ్ కాల్వను సైతం శుభ్రం చేయకపోవడంతో చెత్తా చెదారంతో నిండిపోతుంది. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్మించిన మరుగుదొడ్లు సైతం అందుబాటులో లేక నిరుపయోగంగా మారాయి. పేరుకే స్టేడియం తప్ప అందులో క్రీడాకారులకు అవసరమ య్యే కనీస వసతులూ లేవు. స్టేడియం చుట్టూ పూర్తిస్థాయిలో ప్రహరీ లేదు. ఇటీవల కాలంలో సైడ్ డ్రెయినేజీ కాల్వ నిర్మాణం చేపట్టిన సమయంలో ప్రధాన గేటు వద్ద ఇరువైపులా ప్రహరిని కూల్చారు. అది అలాగే ఉండి పోయింది. దీంతో స్టేడియానికి రక్షణ లేకుండా పోయింది.

స్టేడియం నిర్మించాలని డిమాండ్

గిరిజన ఖిల్లా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో క్రీడా స్టేడియాన్ని నిర్మించాలని క్రీడాకారుల నుంచి అనేక సంవత్సరాలుగా డిమాండ్ వస్తున్నప్పటికీ దానిని అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ డిమాండ్ ఉన్నప్పటికీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర విభజన జరిగి ఈ ప్రాంతం జిల్లా కేంద్రంగా ఏర్పడ్డప్పటికి క్రీడాకారుల కల నిజం కావడం లేదు. గిరిజన ప్రాబల్య మానుకోటలో స్టేడియం నిర్మిస్తే విద్యార్థులు, క్రీడాకారులు క్రీడలపై మక్కువ చూపి ఈ ప్రాంతాన్ని క్రీడా చరిత్రలో విశ్వవ్యాప్తం చేసి పూర్వవైభవం తీసుకురానున్నారు. జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా 20 నుంచి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించి క్రీడా స్టేడియాన్ని నిర్మించి అందులో ఆయా క్రీడా కోర్టులను ఏర్పాటు చేసి క్రీడల అభ్యున్నతికి కృషి చేయాలని క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా అందులోనే ఇండోర్ స్టేడియాన్ని నిర్మించి ఇండోర్ గేమ్స్‌ను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్ని హంగులతో నిర్మించాలి

బొడ్డుపల్లి ఉపేంద్రం
మా అసోసియేషన్ అధ్యక్షుడు, మానుకోట



దినదినాభివృద్ధి చెంది జిల్లా కేంద్రంగా ఏర్పాటైన మానుకోటలో అన్ని హంగులతో క్రీడా స్టేడియాన్ని నిర్మించాలి. జిల్లా కేంద్రంలో స్టేడియం, క్రీడా మైదానాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన మానుకోట గడ్డపై క్రీడా స్టేడియం లేకపోవడం బాధాకరం. సుమారు 20 నుంచి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించి అందులో క్రీడా స్టేడియాన్ని నిర్మించి క్రీడల అభ్యున్నతికి కృషి చేయాలి.